భూ పరిరక్షణే ధ్యేయం..!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు అధికార యంత్రాంగం ప్రత్యేక వ్యూహంతో ముందు కెళ్లాలని యోచిస్తోంది. ఈనెల 14న 'యథేచ్ఛగా భూదందా.. సర్కారు భూముల్లో దర్జాగా నిర్మాణాలు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు భూపరిరక్షణ ధ్యేయంగా చర్యలకు సన్నద్ధమవుతోంది.



- జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూమి 5,195 ఎకరాలు
- జిల్లాలో అసైన్డ్ చేసిన భూములు 11,384 ఎకరాలు
- ప్రభుత్వ, అసైన్డ్ భూములపై ఆరా తీస్తున్న రెవెన్యూ శాఖ
- వీఆర్‌ఓ, వీఏఓలు లేక ప్రభుత్వ భూములపై తప్పిన పట్టు
- టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుపై అధికార యంత్రాంగం యోచన

సాక్షి,మేడ్చల్‌జిల్లా: క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ, అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా నిలిచి వాటి ఆక్రమణలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేసే వీఆర్‌ఓ, వీఏఓల వ్యవస్థను గత ప్రభుత్వం సంబంధిత శాఖ నుంచి తప్పించింది. ఆ తర్వాత ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. దీంతో భూ పరిరక్షణ రెవెన్యూ శాఖకు ఇబ్బందికరంగా మారింది. గతంలో ప్రతి మండల పరిధిలో వీఆర్‌ఓ, వీఏఓలు కనీసంగా 100మంది వరకు ఉండేవారు. వారు రెవెన్యూ శాఖ విధుల నిర్వహణలో చేదోడు వాదోడుగా ఉండేవారు. ప్రస్తుతం వీరందరిని ఇతర శాఖల్లోకి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మార్చటం వల్ల రెవెన్యూ శాఖకు ప్రభుత్వ భూముల రక్షణ సమస్యగా తయారైంది.

◆ దీంతో జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూములు అక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు అందినా.. మండలం పరిధిలో ఉన్న కొద్దిపాటి రెవెన్యూ ఉద్యోగులు పోలీసుల సహకారంతో చర్యలు తీసుకోవటం.. మినహాయించి ఏమి చేయలేని నిస్సహాయత దాపురించింది. భూరక్షణకు పోలీసుల సహకారం తీసుకుందామన్న వారు ప్రతీరోజు ఏదో అధికారిక కార్యక్రమాల పేరుతో బందోబస్తులో ఉంటున్నామని బదుల్వీడంతో సకాలంలో భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోలేకపోతున్నట్లు రెవెన్యూ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ జిల్లా అధికార యంత్రాంగం మాత్రం ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు ప్రత్యేక వ్యూహంతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు వైపు చూస్తోంది.

భూముల గుర్తింపు టాస్క్‌ఫోర్స్‌పై బాధ్యత.!

◆ జిల్లాలో 15 మండలాల పరిధిలో గతంలో గుర్తించిన ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలను మరోసారి పరిశీలించి వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యూహాత్మకంగా వ్యవహరించాలని యంత్రాంగం భావిస్తోంది. భూకబ్జాల్లో రాజకీయ పార్టీ నేతలతో పాటు పలువురి ప్రజాప్రతినిధులు ప్రమేయం ఉండగా... కొందరి ఉద్యోగుల సహకారం కూడా ఉన్నట్లు గుర్తించిన యంత్రాంగం గట్టి నిర్ణయంతో పాటు శాఖపరమైన క్రమ శిక్షణ చర్యలకు ఉపక్రమించాలని భావిస్తోంది.

◆ ప్రభుత్వ, అసైన్డ్ భూములను సంరక్షించే బాధ్యత ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్లపైనే ఉందన్న హుకుం జారీ చేసిన యంత్రాంగం రెవెన్యూ శాఖ స్థాయిల్లో టాస్క్ ఫోర్స్ టీమ్‌లను నియమిస్తే ఎలా ఉంటుందని ఆరా తీస్తోంది. అలాగే, గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రహరీ గోడలు, ఫెన్సింగ్ వంటి రక్షక చర్యలు చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది.

ప్రభుత్వ సంరక్షణలో ఎంత భూమి ఉందో చెప్పని అధికారులు...

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 11 మండలాల పరిధిలో దాదాపు 269 సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూ శాఖ... అందులో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి. ఎంత సంరక్షణలో ఉందన్న సమాచారాన్ని మాత్రం చెప్పలేకపోతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం బాలానగర్ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది.

◆ శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపలి మండలంలో 900 ఎకరాలు, ఘట్కేసర్ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలో 600 ఎకరాలు, బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డుల్లో పేర్కొంది.

జిల్లాలో అసైన్డ్ భూములూ ఎక్కువే...

◆ జిల్లాలో 2004సంవత్సరం వరకు 116 రెవెన్యూ గ్రామాలు, బస్తీల పరిధిలో 8,230 మంది పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లబ్ధిదారులకు 11,384ఎకరాల ప్రభుత్వ భూములను అసైన్డ్ చేశారు. ఈ అసైన్డ్ భూములన్నీ వ్యవసాయ పంట సాగు, ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ మండలంలోని 17గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేట మండలంలోని 30 గ్రామాల్లో 1451 ఎకరాలు, కీసర మండలంలోని 16 గ్రామాల్లో 1500 ఎకరాలు, మేడ్చల్ మండలంలోని 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్ మండలంలోని 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 855 ఎకరాల అసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వం హయాంలో రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేసింది. అదులో 30శాతం వరకు వెంచర్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆస్పత్రులుగా మారినట్లు తెలుస్తోంది.

వైభవంగా పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం



భక్తులకు అన్నదానం చేస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్‌లోని పోచమ్మ దేవాలయ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారిని దర్శించుకుంటే అష్టఐశ్వర్యాలు సిద్ధిస్తాయన్నారు. భక్తులు డప్పు వాయిద్యాల మధ్య బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దేవస్థానం పెద్దలు, కె. రాజు ముదిరాజు, కంచి మహేందర్, రమేష్ బాబు, కె. చిట్టిబాబు, కె. రాజు పటేల్, కె. అనిల్, వి. నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్ షరీఫ్‌కు ఎమ్మెల్యే చాదర్ సమర్పణ



అజ్మీర్ షరీఫ్ దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు మంగళవారం అజ్మీర్ షరీఫ్ దర్గాని దర్శించుకున్నారు. అజ్మీర్ షరీఫ్ బాబాకు చాదర్‌ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నర్సింహాయాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, దొడ్ల వెంకటేష్‌గౌడ్, పండాల సతీష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, బాబూరావు, మాధవరం రంగారావు, శ్రీహరి, మేడ్చల్‌జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



మొయిజ్ సమక్షంలో కాంగ్రెస్‌లో యువకులు

మూసాపేట: మూసాపేటకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మంగళవారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మొయిజ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మోయిజ్ కాంగెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అస్లాం, రవి, మహేష్, పవన్, సాయి, సురేష్, చిన్న, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

తెలిదేవర భానుమూర్తికి సత్కారం

పంజగుట్ట: వ్యంగ్య పుస్తకాలు రాయడంలో అరితేరిన రచయిత తెలిదేవర భానుమూర్తి అని పలువురు వక్తలు అన్నారు. భానుమూర్తి రచించిన 'లత్కోర్‌సాబ్' గ్రంథ పరిచయ సభ మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దళిత సాహిత్య కళా పరిశోధకులు డాక్టర్ జయధీర్ తిరుమలరావు, ఆత్మీయ అతిథిగా మందలపర్తి కిషోర్, గ్రంథ పరిచయం, సీనియర్ పాత్రికేయులు తెల్లా వజ్జల, వయోధిక పాత్రికేయ సంఘం కార్యదర్శి కె.లక్ష్మణరావు, సభాధ్యక్షత వయోధిక పాత్రికేయ సంఘం ఉపాధ్యక్షులు వ్యవహరించారు. వారు మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు ప్రస్తుతం వారు చెప్పే హామీలు, వాగ్దానాలు, నేతల కోతలు వ్యంగ్యంగా ఈ పుస్తకంలో చక్కగా చెప్పారని అభిప్రాయపడ్డారు. ఒక్కో అధ్యాయం ఒక చిన్న నాటకం మాదిరి చెయ్యవచ్చని, ఈ పుస్తకం నుంచి ఎంతో ఔట్‌లెట్ వస్తాయన్నారు.

సబ్ ప్లాన్ నిధులను సంరక్షించాలి

లిబర్టీ: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు యాదగిరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల నిధులను దారి మళ్లించిందని ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో దాదాపు మూడు లక్షల కోట్ల రూపాయలను ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఖర్చు చేయకుండా సంక్షేమానికి వినియోగించకుండా వివిధ పథకాలకు ఖర్చు చేసి దళితుల అభివృద్ధిని అడ్డుకుందని ఆరోపించారు. హుస్సేన్‌సాగర్ శుద్ధి కోసం హైదరాబాద్ నగర సుందరీకరణ కోసం ప్రభుత్వం వివిధ పథకాలను ఎస్సీలకు ఖర్చు చేయకుండా ఆయా పథకాలను దారి మళ్లించిందని యాదగిరి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఆ వర్గాల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం ఖర్చు చేసేలా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని దారి మళ్లించకుండా చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమల స్థాపనకు సకాలంలో అనుమతులు

- సంబంధిత అధికారులతో సమావేశంలో కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: పారిశ్రామికాభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరించి టీఎస్– ఐపాస్, టీ ప్రైడ్ కింద అర్హులైన వారికి పరిశ్రమల ఏర్పాటుకు ఆలస్యం చేయకుండా అనుమతులు ఇవ్వాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో టీఎస్–ఐపాస్, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ (డీఐపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు స్థాపించేందుకు ఎంతో అనుకూలత ఉందని, పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తుంటారని వారికి అన్ని రకాల అర్హతలు ఉన్నట్లయితే త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. పరిశ్రమ ప్రోత్సాహక కమిటీ ద్వారా జిల్లాలో ఏర్పాటు చేసే పరిశ్రమలకు సంబంధించి ఆయా శాఖల ద్వారా జారీ చేయాల్సిన అనుమతుల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, సత్వరమే అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. టీఎస్ ఐపాస్ కింద పరిశ్రమలకు కావాల్సిన వివిధ అనుమతుల మంజూరు పురోగతిపై సమీక్షించారు. జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ 14 మంది ఎస్సీ పారిశ్రామికవేత్తకు రూ.38,72,528, పదిహేను మంది ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.46,13,992, ఇద్దరు జనరల్ పారిశ్రామికవేత్తలకు రూ.3,54,359 పెట్టుబడి రాయితీ కింద మంజూరీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైద్యాధికారులు సమయపాలన పాటించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించటంతో పాటు ప్రజలకు సేవలందించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. ప్రజలకు సేవ చేయడంలోనే ఎంతో సంతోషం ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ (డీఎం అండ్ హెచ్‌వో) అధికారి డాక్టర్ రఘునాథస్వామితో కలిసి వైద్యశాఖ పనితీరుపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం ఆరోగ్య శాఖకు సంబంధించి పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ, పల్లె దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎలాంటి వైద్యం అందిస్తున్నారనే విషయాలపై ఆయన పూర్తి స్థాయిలో అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల్లో వైద్యం సరిగ్గా అందడంలేదనే ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి, వైద్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి



జీహెచ్‌ఎంసీ డీసీకి వినతిపత్రం అందజేస్తున్న కుమార్‌యాదవ్, కేశవరావు

బీజేవైఎం నాయకుల డిమాండ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ శంషీగూడ ప్రాంతంలోని సర్వే నం.57 ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్, సీనియర్ నాయకుడు కేశవరావు, స్థానిక నాయకులతో కలిసి డీసీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ... ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమంగా రాత్రికి రాత్రి ఇళ్లను నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వ అధికారులు కబ్జాదారులకు అమ్ముడుపోయి యథేచ్ఛగా సాగుతున్న అక్రమ నిర్మాణాల దందాకు సహకారం అందించటం శోచనీయమన్నారు.

◆ కోర్టు ఉత్తర్వులు వచ్చిన, మౌఖిక ఆదేశాలు ఉన్నా అక్రమ నిర్మాణాలను ఎందుకు తొలగించటంలేదన్నారు. వెంటనే సర్వే నం.57 ప్రభుత్వ భూములైన దత్తాత్రేయకాలనీ, రైతుబజార్ వెనుక, శంషీగూడ ప్రాంతాలలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలన్నారు. లేకపోతే జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ కార్యాలయాలను ముట్టడించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అదే విధంగా డివిజన్‌లో నెలకొని ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌కే చారి, డివిజన్ సెక్రటరీ శ్రీకాంత్, రమేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



బండి రమేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పల్లపు వేణు

మోతీనగర్: బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అల్లాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పల్లపు వేణు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా నియమితులైన బండి రమేష్‌ను పల్లపు వేణు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయటంలో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉంటుందన్నారు. ముఖ్యమంత్రిగా ఎన్నికైన వారంలోపే రెండు గ్యారంటీలను పూర్తి చేశారని తెలిపారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసి అభివృద్ధి మాటలకు మాత్రమే పరిమితమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం పేద ప్రజలకు అవసరమయ్యే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాకీర్, శివ, సంతు, సురేష్, భాష, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



ఆర్‌ఆర్‌నగర్‌లో అయ్యప్పస్వామి మహా పడిపూజలో పాల్గొన్న స్వాములు



ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లోని ఆర్‌ఆర్‌నగర్‌లో వెంకటేశ్,రోహిత్ గురుస్వామి,సూర్య కన్నెస్వామి,శ్రీనివాస్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడి పూజను కనుల పండుగగా నిర్వహించారు. అయ్యప్ప శరణు గోసతో ఈ ప్రాంతమంతా మార్మోగింది.అయ్యప్ప భజన బృందం ఆలపించిన అయ్యప్ప కీర్తనలు భక్తి భావాన్ని పెంపొందించాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అయ్యప్పను దర్శించుకుని పులకించిపోయారు. ఏడు కొండలు, లక్ష్మీపతి గురుస్వాములు పూజలో పాల్గొన్న స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

హరిహర క్షేత్రంలో...

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రంలో మంగళవారం అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. శివయాన మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలో మేడ్చల్ బీజేపీ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో వీకే రావు, నాగరాజు, రమేష్, వేణు, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

బాలానగర్: జేఎన్‌టీయూలోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ డైరెక్టర్ ఎస్ఎస్ దిలీప్ ఆధ్వర్యంలో మహిళల, పురుషుల కరాటే క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ ఎంపికైన క్రీడాకారులు జనవరి 16 నుంచి 20 వరకు ఎస్ఎస్‌సీటీ యూనివర్సిటీ, భూపాల్‌లో జరిగే తుది పోటీల్లో పాల్గొనున్నారు. వీరికి కరాటే కోచ్‌తో శిక్షణ తరగతులు నిర్వహించారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డా. నల్లగొండ అశోక్ ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎన్నుకున్నారు.

హ్యాండ్ బాల్ సౌత్‌జోన్ టీమ్ ఎంపిక ...

మహిళా హ్యాండ్ బాల్ సౌత్ జోన్ టీమ్ మంగళవారం ఎంపిక చేశారు. సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిలింగ్ డా. ఎస్ఎస్ దిలీప్ ఆధ్వర్యంలో మహిళా హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. యూనివర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలోని మహిళా క్రీడాకారులు ఈ ఎంపికకు పోటీపడ్డారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10 నుంచి 14 వరకు పెరియార్ యూనివర్సిటీ సేలంలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనున్నారు. ఈ ఎంపిక కార్యక్రమంలో సీమర్ ఐటీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ మోహన్‌రావు, జేఎన్‌టీయూ ఫిజికల్ డైరెక్టర్ డా. నల్లగొండ అశోక్ క్రీడాకారుల ఎంపికలో పాల్గొన్నారు.

ప్రొఫెసర్ల పదోన్నతులపై విచారణ జరిపించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ, కేయూ సీనియర్ ప్రొఫెసర్స్ పదోన్నతుల్లో జరిగిన అవకతవకలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా సీనియర్ ఐఏఎస్ అధికారితో విచారణ జరిపించాలని మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. గతంలో ఎన్నడు లేని విధంగా పదోన్నతుల్లో అక్రమాలు జరగడం సిగ్గుచేటని ఏఐఎస్‌ఎఫ్ నేతలు లెనిన్, నెల్లి సత్య ధ్వజమెత్తారు. ఇదే అంశం పై ఏబీవీపీ నాయకులు పృథ్వీతేజ, కమల్ సురేష్, సుమన్ శంకర్, అలివేలి రాజు, గణేష్ రాష్ట్ర గవర్నర్‌కు బహిరంగ లేఖ రాశారు.

పోస్టర్ ఆవిష్కరణ

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక–2023 ఈనెల 30న నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జె.లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. మంగళవారం వాల్‌పోస్టర్‌ను కళాశాలలో ఆవిష్కరించారు.

కాంగ్రెస్ హామీలను నెరవేర్చాలి

లిబర్టీ: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను తూచా తప్పకుండా అమలు చేయాలని జన సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వెంకట నారాయణ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆరు గ్యారంటీలను అమలుచేసి ప్రజల ఆదరణ పొందాలని సూచించారు. మంగళవారం లిబర్టీ ప్లాజాలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు హామీలు అమలు చేస్తూనే ప్రజలు విశ్వసిస్తారన్నారు. కొత్త పథకాలు అమలు కోసం ఆర్థిక వనరులు సమీకరించుకునే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంటుందన్నారు. పథకాలను అమలు చేస్తూనే కొత్త పథకాలు వేగంగా అమలు చేసేందుకు దృష్టి సారించాలని కోరారు. అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని సూచించారు. విద్య, వైద్యం రోడ్లు తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలు తలెత్తకుండా వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


సీఎం రేవంత్ నిర్ణయం చరిత్రాత్మకం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణపై సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని టీపీసీసీ అధికార ప్రతినిధి, పలువురు అధ్యాపకులు పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు హైదరాబాద్ మహానగరాన్ని డ్రగ్స్ రహిత నగరంగా మార్చుకుందామంటూ మంగళవారం యూనివర్సిటీ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం చనగాని దయాకర్ మాట్లాడుతూ యువత డ్రగ్స్ వినియోగించకుండా నూతన సంవత్సర వేడుకలపై పోలీసుల నిఘా అవసరమన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు యంత్రాగానికి పూర్తి స్వేచ్ఛ కల్పించడం శుభపరిణామం అన్నారు. వర్సిటీలు, కాలేజీలలో యాంటీ డ్రగ్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేయాలని పబ్బులు, క్లబ్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకొని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తయారు చేయాలన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానం

బంజారాహిల్స్: టీటీడీ దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గీతాజయంతి సందర్భంగా హిమాయత్‌నగర్ టీటీడీ కల్యాణమండపంలో మంగళవారం భగవద్గీత పోటీలను నిర్వహించారు. 6,7 తరగతుల విభాగంలో ప్రథమ బహుమతి జె. త్రిపుర, ద్వితీయ బహుమతి వంశీదత్త, తృతీయ బహుమతి కీసరగుట్ట టీటీడీ వేద పాఠశాలకు చెందిన కశ్యప్, 8,9 తరగతుల విభాగంలో ప్రథమ బహుమతి భవన్స్ స్కూల్‌కు చెందిన అక్షయకృష్ణ గెలుచుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మానస (ఫైల్)

బాలానగర్: డీసీఎం వ్యాన్ ఢీకొట్టిన సంఘటనలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్‌లో నివాసం ఉండే హరీష్, మానస దంపతులు షాపింగ్ చేసేందుకు చింతల్ నుంచి కూకట్‌పల్లికి వెళ్తుండగా నర్సాపూర్ చౌరస్తాలో యూటర్న్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వేగంగా వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. దాంతో ద్విచక్ర వాహనంపై నుంచి మానస కింద పడి తీవ్రగాయాలపాలైంది. సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. కాగా మానస నాలుగు నెలల గర్భిణి. భర్త హరీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా బాలానగర్ పోలీసులు తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 45, బెండకాయ 50, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 55, పందిరి బీర 55, క్యాబేజీ 16, క్యారెట్ 33, దొండ 55, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 65, గోకరకాయ 55, కీర 18, దోసకాయ 28, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 21, చామగడ్డ 45, మొరంగడ్డ 21.

బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఆన్‌లైన్ వర్క్‌షాప్ ప్రారంభం

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విభాగం ఈనెల 22 వరకు నిర్వహించనున్న బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఆన్‌లైన్ వర్కుషాప్ జేఎన్‌టీయూహెచ్‌లో ప్రారంభించారు. ఈ వర్కుషాపులో బ్లాక్ చైన్ టెక్నాలజీ రంగంతో వర్ధమాన సమస్యలు, ఎదుర్కోవాల్సిన సవాళ్ల గురించి నిష్ణాతులైన ప్రశాంత్ సాహు, ట్రాన్స్ యూనియన్ కన్సల్టెంట్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ వారిచే అవగాహన కల్పించనున్నారు.

◆ ఈ కార్యక్రమం వైస్‌చాన్సలర్ ప్రొ. కట్టా నర్సింహారెడ్డి, ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ రంగంలో అధ్యాపకులు, విద్యార్థుల నైపుణ్య సామర్థ్యాలను పెంపొందించడమే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ ముఖ్య ఉద్దేశమని అన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ... ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో సైబర్ నేరాలను అరికట్టడంలో బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఈ వర్కుషాప్‌ను ఉపయోగించుకొని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు, అధ్యాపకులు తయారు కావాలన్నారు.

◆ రిజిస్ట్రార్ ప్రొ. మంజూర్ హుసేన్ మాట్లాడుతూ... బ్లాక్‌చైన్ టెక్నాలజీ గురించి ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలన్నారు.ఈ వర్క్‌షాప్‌ను ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహించి అందరికీ అందుబాటులో ఉంచామన్నారు. ఈ అవకాశాన్ని బీటెక్, ఎంటెక్ విద్యార్థులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వర్క్‌షాప్‌లో జేఎన్‌టీయూ అనుబంధ, ఇతర కళాశాలల నుంచి 135 మంది విద్యార్థులు,అధ్యాపకులు రిజిస్టర్ చేసుకున్నారని వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొ. శ్రీదేవి తెలిపారు.

పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన గొట్టిముక్కల వెంగళరావు

కూకట్‌పల్లి: ఫతేనగర్ డివిజన్‌లోని పోచమ్మ దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించారు.